''మరి.. చిట్టి వయసెంత?'' అడిగాడు రావు.

''మూడు సంవత్సరాలు''.

''అంటే..? ఈ పాప చిట్టి కంటే పెద్దదా?''.

మరోసారి అవునన్నట్టు తలూపింది సుజాత.

రావు అవాక్కయ్యాడు.

''మరి ఆహారం ఏం ఇస్తున్నావు సుజాతా?''.. సమాధానం తెలిసినా యథాలాపంగా అడిగేశాడు రావు.

''గరీబోల్లం. ఏమిస్తం సర్? మేం ఏం దింటే గదే!''.

''కాన్పు ఇంటి దగ్గరైందా? హాస్పిటల్‌లోనా?''.

''హాస్పిటల్‌లో''.

''ఆపరేషన్ చేశారా?''.

''హా.. జేసిన్రు''.

''ఆపరేషన్ అయ్యాక కళ్లు తెరిచి బిడ్డను చూడగానే నీకు ఏం అనిపించింది?''.

సుజాత మళ్లీ మౌనంగా ఉండిపోయింది. కొన్ని క్షణాల తర్వాత నెమ్మదిగా బదులిచ్చింది..

''ఈ బిడ్డ నాకు పుట్టలేదు సార్''.

''మరి!!!?''.

''మేం సాక్కుంటున్న బిడ్డ!''.

రావుపైన పిడుగుల మీద పిడుగులు పడుతున్నాయి.

''మీరు సాదుకుంటున్న బిడ్డా!!!?''.

''అవును సార్''.

''ఏమీ అనుకోకపోతే కాస్త వివరంగా చెప్తావా?'' అభ్యర్థించినట్లే అడిగాడు డా.రావు.

సుజాత చెప్పడం మొదలుపెట్టింది..

''మాకు చిన్న వయసులోనే లగ్గమైంది. మూడేళ్లయినా బిడ్డలు కాలే. ఎవ్వలనైనా సాక్కోవాలని అనుకున్నం. గరీబోల్లకు బిడ్డల్ను ఎవలిస్తరు సార్? మా అసుంటి గరీబోల్లనే అడిగినం. వాల్లకిది మూడో కాన్పు. ఆడబిడ్డని ఆల్లకు ముందే దెల్సు. మాకు సుతం సెప్పిన్రు.. మేం ఇట్టపడే బిడ్డను దీసుకున్నం!''.

''మరి ఈ బిడ్డ ఆరోగ్యం గురించి తెలిసిన తర్వాత.. బిడ్డనిచ్చిన తల్లితండ్రులకు అసలు విషయం చెప్పి, బిడ్డను తిరిగి ఇచ్చేసే ప్రయత్నం చేయలేదా?''.

''చెయ్యలే సార్! గీ బిడ్డకు గిట్లయితదని ఆల్లకు డాక్టర్లు ఆరో నెలలోనే జెప్పింద్రంట. ఆల్లకు అన్నీ దెలిసి.. బిడ్డను ఒదిలించుకునేటందుకే మాకు ఇచ్చిన్రు కావొచ్చు. అసంటోల్లకు మల్ల బిడ్డను తిరిగిస్తే ఏం జేస్తరు సార్? బిడ్డను ఏమైనా జేస్తే? పాపం కదా సార్.. ఆల్లు అద్దనుకున్నరు. మేం గావాలె అనుకున్నం. బస్.. గియన్నీ కాదు సార్.. నేను ఒక్కటే అనుకున్నా. ఈ బిడ్డ నా కడుపునే పుట్టుంటే? వదులుకుంటనా? లేదుగదా. గిప్పుడూ అంతే. ఇది నా బిడ్డే!''..

రావు కళ్లు చెమ్మగిల్లి మసకబారాయి.

'నిండా ముప్పై ఏళ్లు లేని ఈ అమ్మ ఇంత పెద్ద అమ్మ ఎలా అయ్యింది? ఈమెకు ఇంత పెద్ద మనసు ఎలా వచ్చింది?' అని ఆశ్చర్యపోతున్నాడు డా.రావు.

''చిట్టి పుట్టిన తర్వాత ఈ పాపను ఏదైనా ప్రభుత్వ కేంద్రంలో అప్పగించాలన్న ఆలోచన రాలేదా?''.

''శానమంది పెద్దోల్లు, డాక్టర్లు గదే సలహా ఇచ్చిన్రు. కానీ మేం ఆ పనిజెయ్యలే!''.

''ఎందుకని?''.

''మేం ఇంకా బతికే ఉన్నం గదా సార్. మీరు జెప్పిన సెంటర్ల మంచి మందులు, వైద్యం ఇస్తరు కావొచ్చు. కానీ, అమ్మానాయినల్ని ఇయ్యలేరు గదా సార్. బిడ్డలకు ముందుగాల కావల్సింది అమ్మానాయినలు. ఆ తర్వాతే ఇంకేమైనా. గిది.. నా పెద్దబిడ్డ! సిట్టి నా సిన్నబిడ్డ. సిట్టి నాకు ఈ బిడ్డ తర్వాతనే. పెద్దబిడ్డ వైద్యం కోసం మా రెక్కలున్నంత వరకు పోరాడ్తం సార్. మా పుట్టింటోల్లు ఇచ్చిన భూమిని అమ్మినం. అత్తింటోల్ల ఇల్లు అమ్మినం. నా పుస్తెల తాడు సుత అమ్మిన. ఇంకా.. అమ్మను నేను బతికే ఉన్నా. పైన దేవుడున్నడు, మీలాంటి మంచోల్ల దీవెనలు ఉంటయ్. బతకడానికి ఇవి సరిపోవా సార్?''.

పదివేల మంది ముందు ప్రేమ గురించి మాట్లాడుతున్న మదర్ థెరిసాలా కనిపిస్తున్నది సుజాత.. డా.రావు కంటికి. పదివేల మంది హర్షాతిరేకంతో చేస్తున్న చప్పట్ల ధ్వని అతని చెవుల్లో మారుమోగుతున్నది.

డా.రావు కళ్లు జలపాతాల్లా వర్షిస్తున్నాయి. అతని అణువణువూ భావావేశంతో ప్రకంపిస్తున్నది. ప్రేమ పరిమళాలతో కంపార్ట్‌మెంట్ నిండిపోయినట్టు అనిపించింది డా.రావుకు. ఇప్పుడు అతనికి మాడిపోయిన నూనె వాసన రావడం లేదు ఆమె దగ్గర. అమ్మదనపు కమ్మని పరిమళాలు ఆస్వాదిస్తున్నాడు. అతను ఆమె కళ్లలోకి చూస్తూ ఉండిపోయాడు. అలా చూడటం సంస్కారం కాదని అతనికి తెలుసు. ఆమె అమ్మతనం ముందు, ఆమె మాతృసౌందర్యం ముందు.. అతని సంస్కారం ఓడిపోయింది. ఓడిపోయి గెలిచింది. ఎవరు పెట్టారో కానీ.. ఆమె నిజంగా సార్థక నామధేయురాలు.

ఆడపిల్ల అనే కారణంతో కడుపులోని శిశువును కడతేరుస్తున్న ఈ కలికాలంలో.. పుట్టింది ఆడపిల్ల అని తెలియగానే ముళ్లకంచెల్లో, డ్రైనేజీల్లో పారేస్తున్న ఈ అనాగరిక సమాజంలో.. డబ్బులకోసం ఆడపిల్లలను తెగనమ్ముకుంటున్న ఈ పాపిష్టి రోజుల్లో.. పేగు తెంచుకుని సలక్షణంగా పుట్టిన బిడ్డ కళ్లముందు కనిపిస్తున్నా.. ఎవరికో పుట్టిన బిడ్డను.. ఆడబిడ్డను.. అంగవైకల్యంతో ఉన్న బిడ్డను.. కోలుకుంటుందో లేదో తెలీని బిడ్డను.. మూడున్నర ఏళ్లుగా జీవచ్ఛవంలా ఉన్న బిడ్డను.. అక్కున చేర్చుకొని, అమ్మ అయ్యి, సహనంలో భూమాత అయ్యి, సేవలు చేస్తూ.. కన్న కూతురికంటే ఎక్కువ ప్రేమను పంచుతూ, కంటికి రెప్పలా కాపాడుతున్న సు.. జాత. సుజాతను ప్రత్యక్షంగా చూస్తున్నందుకు, ఆమెతో మాట్లాడుతున్నందుకు ఎంతో గర్వంగా అనిపించింది డా.రావుకు. నమ్మలేని ఓ గొప్ప నిజం కళ్లముందు సాక్షాత్కరించినట్టు, ఓ పరమాద్భుతం ప్రత్యక్షమైనట్టు అలౌకిక ఆనందంతో స్థాణువులా ఉండిపోయాడు.

* * *

ట్రైన్ తిరుపతి స్టేషన్‌లో ఆగింది. ఎవరి లగేజీలతో వాళ్లు కిందికి దిగారు. ప్లాట్‌ఫామ్ పైన ఉన్న వాటర్ ట్యాప్ దగ్గర చిట్టి, పోచయ్య, సుజాత మొహాలు కడుక్కుంటున్నారు. డా.రావు పక్కనే ఉన్న స్టాల్‌లో రెండు వాటర్ బాటిల్స్, కొన్ని పళ్లు, బిస్కెట్స్ కొన్నాడు. బన్నూతో కలిసి సుజాత కుటుంబం ఫ్రెష్ అప్ అవుతున్న చోటుకు వచ్చాడు. అప్పటికే వాళ్లు స్టేషన్ బయటికి వెళ్లడానికి ప్లాట్‌ఫామ్ మీద నడుస్తున్నారు.

''ఒక్క నిమిషం సుజాత.. గారు!''.. యాదృచ్ఛికంగా డా.రావు పిలుపు మారిపోయింది.

ఆమె ఆగి వెనక్కి తిరిగింది. డా.రావు మోకాళ్ల మీద కూర్చొని, రెండు చేతులెత్తి ఆమెకు నమస్కరించాడు. అదంతా అతని అంతరంగంలో.. బాహ్య ప్రపంచంలో అతను నిలబడే ఉన్నాడు. డా.రావు తన షర్ట్ పాకెట్లో చెయ్యి పెట్టి.. రూ.1000 నోట్ పట్టుకున్నాడు. కానీ, పైకి తీసే ధైర్యం చేయలేకపోయాడు. తాను చేసే సహాయం దేనికో అతనికే ఒక స్పష్టత లేదు.

వ్యక్తిత్వంలో, మాతృత్వంలో, మానవత్వంలో ఎవరెస్ట్ శిఖరం పైన మరో వెయ్యి శిఖరాలను పేర్చి.. అక్కడ నిలబడి, ఇంకా పైకే చూస్తున్న ఆ మహాసాధ్వికి, ఆ మహోన్నత స్త్రీమూర్తికి, ఆ మహాతల్లికి, ఆ గొప్ప అమ్మకు వెయ్యి రూపాయలిచ్చి, ఆమె ఆత్మాభిమానాన్ని కించపరచే సాహసం చేయలేక.. అలా అని ఏమీ చెయ్యకుండా ఉండలేక తటపటాయిస్తున్నాడు డా.రావు.

''సార్! పిలిసిన్రు.. మల్లా సప్పుడు జెయ్యలే!''.. విషయమేంటో చెప్పమనే ధోరణిలో అన్నది సుజాత.

డా.రావు అప్రయత్నంగా జేబులోని వెయ్యి రూపాయల నోట్‌ను జేబులోనే వదిలేసి.. ఆ నోట్ పక్కనే ఉన్న విజిటింగ్ కార్డ్‌ను బయటికి తీశాడు.

''ఇది మీ దగ్గర ఉంచండి. నేను డాక్టర్ని. ఎప్పుడైనా, ఏదైనా అవసరమైతే.. ఒక అన్నయ్యగా అనుకొని నాకు ఫోన్ చేయవచ్చు'' అన్నాడు.

సుజాత తన ఒడిలోని బిడ్డను, మామ చేతికిచ్చి.. కార్డ్ తీసుకుంది. రెండు చేతులతో మొక్కింది.

''మీరు మంచోల్లు సార్! మీరు సల్లగుండాలె!''.

''బస్‌లో పనికొస్తాయ్. ఇవి ఉంచండి!'' అంటూ, వాటర్ బాటిల్స్, పళ్లు, బిస్కెట్స్ ఉన్న కవర్‌ను చిట్టి చేతికి అందించాడు రావు. సుజాత కృతజ్ఞతగా చూసింది.

పోచయ్య, చిట్టి, సుజాత ముగ్గురూ ప్లాట్‌ఫామ్ మీద నడుస్తూ ముందుకు కదిలారు. ఒక మహిళా మణిదీపం, మాతృత్వపు మేరు పర్వతాన్ని అధిరోహించి అలవోకగా అలా కదిలిపోతున్నట్టు సంభ్రమాశ్చర్యాలతో చేష్టలుడిగి చూస్తుండి పోయాడు డా.రావు.

దూరంగా గోవిందరాజస్వామి గుడి గోపురం నుంచి కాబోలు.. పోతనామాత్యుడి పద్యం గాలివాటానికి లీలగా వినిపిస్తున్నది.

**అమ్మలగన్నయమ్మ..**

**ముగురమ్మల మూలపుటమ్మ చాలపెద్దమ్మ..**

అనుకోకుండా అతని అంతరంగంలో ఆ పద్యంలోని ఒక పదం పదేపదే ప్రతిధ్వనించింది. చాల పెద్దమ్మ.. చాల పెద్దమ్మ.. చాల పెద్దమ్మ.

'అవును.. సుజాత చాలా పెద్ద అమ్మ. అమ్మలందరికీ అమ్మ. అమ్మలందరికీ చిరునామా!' అనుకున్నాడు.

* * *

ఆ సంఘటన జరిగి కొన్ని ఏళ్లు గడిచిపోయాయి. ఇంతవరకూ డా.రావుకు సుజాత నుంచి ఫోన్ రాలేదు. రాదు కూడా.. ఎందుకంటే ఆమె అమ్మ. అమ్మకు ప్రేమను పంచడమే తెలుసు. తీసుకోవడం తెలియదు. ■

## డా.ఎం. కోటేశ్వర రావు



ఒక పేద యువతి గొప్ప మనసును, మాతృత్వ మాధుర్యాన్ని కళ్లారా చూసి.. ఆ తల్లి గొప్ప గాథను లక్షల మందికి అందించాలనే ఆశయంతో 'అమ్మ చిరునామా' కథను రాశారు డా.ఎం. కోటేశ్వర రావు. ఈయన స్వస్థలం పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు. ఉద్యోగరీత్యా కరీంనగర్‌లో ఉంటున్నారు. తిరుపతి పశువైద్య కళాశాల నుంచి పశువైద్య శాస్త్రంలో పట్టా అందుకొని, ప్రస్తుతం కరీంనగర్ ప్రాంతీయ పశుసంవర్ధక శిక్షణ కేంద్రంలో వైద్యాధికారిగా, మాస్టర్ ట్రైనర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. 4వ తరగతి చదువుతున్నప్పుడే తొలి కథ రాశారు. సుమారు ఏడేళ్ల కిందటే ఈ కథ రాసుకొని.. తగిన సమయం కోసం ఎదురు చూశాననీ, 'నమస్తే తెలంగాణ – ముల్కనూరు సాహితీ పీఠం' కథల పోటీనే ఈ కథకు సరైన వేదికగా ఎంచుకొని, పోటీకి పంపినట్లు రచయిత తెలిపారు. అలాంటి కథకు మొదటి బహుమతి రావడం ఆనందంగా ఉన్నదని పేర్కొన్నారు.